ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 26.0 కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY



5

అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 23 ఆగస్టు 2025

ఆటోవాలాల ఆగడాలు..!

రైల్వేస్టేషన్‌లో అడిగినంత ఇచ్చుకోవాల్సిందే..



రోడ్డుపై ఆటోవాలాలతో గొడవ పడుతున్న స్టాండ్‌లో ఆటోడ్రైవర్లు

వద్దంటే.. దుర్భాషలు..
రాత్రిళ్లు వేలల్లో అడుగుతున్న వైనం
బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
నిద్రమత్తులో నిఘా యంత్రాంగం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆటోవాలాలు.. ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. పక్కనే ఉన్న ప్రాంతాలకు సైతం వందలు డిమాండ్ చేస్తున్నారు. రైళ్లలో వచ్చే.. ఇతర రాష్ట్రాల కూలీలు టమోటా మార్కెట్‌కు వెళ్లాలంటే ఏకంగా మనిషికి వెయ్యి రూపాయలు అడుగుతున్నారు. అంతనా.. అంటే.. దుర్భాషలాడుతున్నారు. బయటికొచ్చి వేరే ఆటోలో వెళ్దామంటే అక్కడకీ వచ్చేసి గొడవ పడుతున్నారు. వారి తీరుతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. వారిని కట్టడి చేయాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

● ఉదయం భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ అనంత రైల్వేస్టేషన్‌కు వస్తుంది. అరగంట వ్యవధిలోనే న్యూఢిల్లీ నుంచి బెంగళూరు వెళ్లే కేకే ఎక్స్‌ప్రెస్ కూడా వస్తుంది. ఈ రెండు రైళ్లలో వచ్చే వారిలో ఎక్కువగా కొత్తవారే ఉంటారు. అలాంటివారు ఆటో అడిగితే వందలు, వేలు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. వారు అడిగినంత ఇచ్చుకోవాల్సిందే.. వారి ఆటోలోనే వెళ్లాల్సిందే. లేదంటే వేరే ఆటోలో వెళ్లనివ్వరు. దీంతో తోటి ఆటోడ్రైవర్లతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంత అద్దె ఏంటంటూ వెళ్లిపోతుంటే.. నానా దుర్భాషలాడుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. 'ఆస్తులు అడిగామా..' అంటూ ప్రారంభించి నానా దుర్భాషలాడుతున్నట్లు తెలుస్తోంది. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన జీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎక్కడుంటారో కూడా తెలీదన్న విమర్శలున్నాయి.



ఆటోవాలాతో మాట్లాడుతున్న ప్రయాణికులు

వద్దంటే.. దుర్భాషలే..

మూడు రోజుల క్రితం ఉదయం 6.30 గంటల సమయంలో రైల్వే స్టేషన్ ముందు వెళ్తున్న మహిళా ప్రయాణికులపై ఆటోవాలా ఒకరు అనుచితంగా ప్రవర్తించినట్లు తెలిసింది. భర్తతో కలిసి వెళ్తున్న మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆటోవాలాలు అడిగినంత ఇవ్వకపోవడంతో బేరం అడిగినందుకు ఇలాంటి పరిస్థితులు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. రెండ్రోజుల క్రితం ఉదయం పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఓ జేఈఈ తమ ఉన్నతాధికారులు భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండటంతో వారిని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లారు. రైలు దిగిన వెంటనే వారిని స్టేషన్ బయటకు తీసుకొచ్చి ఆటోలో వెళ్లే ప్రయత్నం చేశారు. బస్టాండు దగ్గరలోని ప్రాంతానికి వెళ్లాలని చెప్పడంతో 100 ఇవ్వాలన్నారు ఆటోవాలాలు. దగ్గరే కదా.. అని స్థానిక పీఆర్ ఉద్యోగి అనడంతో 'మీ ఆస్తులు ఏమైనా అడిగామా?' అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఆటోవాలాలు ముందుకెళ్లారు. అనంతరం టమోటా మార్కెట్‌కు వెళ్లాలని కూలి పనులకోసం వచ్చిన యువతను టార్గెట్ చేశారు. టమోటా మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే మనిషికి వెయ్యి రూపాయలు అని ఆటోవాలా చెప్పడంతో యువత ఏమి చేయాలో అర్థం కాక కొంత ముందుకెళ్లారు.

బేరానికి అడ్డు తగిలితే దాదాగిరీ..

రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న ఆటోస్టాండులో ఉన్న ఆటోవాలాల బేరానికి అడ్డు తగిలితే దాదాగిరీకి దిగుతున్నారన్న విమర్శలున్నాయి. నగరంపై అవగాహన ఉన్నవారు ముఖద్వారం వద్ద ఆటో ఎక్కకుండా రూ.20కే వెళ్లవచ్చన్న ఉద్దేశంతో బయటకు వెళ్లి ఆటో ఎక్కే ప్రయత్నం చేస్తే.. ఆటోస్టాండ్‌లో ఉన్న ఆటోవాలాలు దాదాగిరీకి దిగుతున్నారన్న చర్చ సాగుతోంది. అవగాహన ఉన్నవారు రైలు దిగి ఆన్‌లైన్‌లో ఆటో బుక్ చేసుకున్నారు. ఆ ఆటో డ్రైవర్ స్టేషన్ ముందుభాగంలో ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా స్టాండ్‌లో ఉన్న ఆటోవాలాలు అతడిపై దౌర్జన్యానికి దిగారు. ఆటోవాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రైల్వే పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రయాణికులకు భద్రత కల్పిస్తాం



సిబ్బంది కొరతతో కొంత ఇబ్బందిగా ఉంది. తగిన భద్రత చర్యలు చేపడుతున్నాం. స్టేషన్ భవనాలు నిర్మాణంలో ఉన్నందున భద్రత కల్పించడం కాస్త ఇబ్బందికరంగా ఉంది. ఉన్న వారితోనే ప్రయాణికులకు భద్రత కల్పిస్తాం. ఆటో స్టాండ్ విషయం మా పరిధిలోకి రాదు. త్రీటౌన్ పోలీసులు చూసుకుంటారు.

-సుధాకర్‌రావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

యూరియా కొరత లేదు

● రైతులు ఆందోళన చెందకండి ● కలెక్టర్ వినోద్‌కుమార్



వీసీలో కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. రైతుసేవా కేంద్రాలలో తీసుకెళ్లవచ్చని సూచించారు. సమస్యలుంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 8500292992కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎరువుల వ్యాపారులు కాంప్లెక్స్‌ను బలవంతంగా అంటగడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మోతాదుకి మించి యూరియా వాడితే దుష్ఫలితాలు కలుగుతాయని, నేలల స్వభావం మారిపోయే ప్రమాదం ఉందని అన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.

దాడులు చేయండి..

ఎరువుల నిల్వలపై జాయింట్ టాస్క్ ఫోర్స్ మెరుపుదాడులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎరువుల లభ్యతపై కలెక్టర్లు, జేసీలు, జిల్లా వ్యవసాయ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అమరావతి నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, మండల స్థాయిలో అగ్రికల్చర్, కో ఆపరేటివ్, మార్క్ ఫెడ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌ను ఇందుకు హెడ్‌గా నియమించాలని, ప్రతిరోజు క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎరువుల రిటైలర్లు, హోల్‌సేలర్స్‌తో జిల్లా వ్యవసాయాధికారి సమావేశం నిర్వహించాలన్నారు. రైతు సేవ కేంద్రంను వ్యవసాయాధికారి, ప్రైవేట్ ఏజెన్సీలను మార్క్‌ఫెడ్ డీఎం, కోఆపరేటివ్ కార్యాలయాలను డీసీఓ తనిఖీలు చేయాలని ఆదేశించారు. వీసీలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీసీఓ అరుణకుమారి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, వ్యవసాయ అధికారి బాలునాయక్ పాల్గొన్నారు. కాగా, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, అనంతపురం ఏఓ వెంకట్‌కుమార్ ఎరువుల దుకాణాల్లో యూరియా విక్రయాలపై ఆరా తీశారు. రుద్రంపేటలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు.

అగ్రస్థానంలో నిలపాలి..

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అమలులో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంపై పోర్టల్ ప్రదర్శన శుక్రవారం నిర్వహించింది. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద గుంతకల్లు మండలంలోని గుండాల తండా, వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి చిన్న తండా, వెంకటాంపల్లి పెద్దతండా, శింగనమల మండలంలోని నాగుల గుడ్డం, నాగులగుడ్డంతండా గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. ఈ గ్రామాల్లో 20శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని డీటీడబ్ల్యూఓను కలెక్టర్ ఆదేశించారు.

రీ వెరిఫికేషన్‌లో దందా..!

దళారులకు లొంగిన కొందరు వైద్యులు
పైసలు ఇచ్చినవారికి
వైకల్యం లేకున్నా ధ్రువీకరణ
అర్హులకు పర్సెంటేజీ తగ్గించి అన్యాయం

శింగనమల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పింఛన్ల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయి. వైకల్యం లేకపోయినా కొందరు దొడ్డిదారిన ధ్రువపత్రాలు తెచ్చుకుని, పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి అక్రమాలను అడ్డుకుని, అర్హులకు న్యాయం చేసేందుకు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కానీ రీ వెరిఫికేషన్‌ను కొందరు అక్రమార్జనకు వాడుకుంటున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు. రీ వెరిఫికేషన్ బాధ్యతను ప్రభుత్వం వేరే జిల్లాల వైద్యులకు అప్పగించింది. ఇలా వచ్చినవారిలో కొందరు కాసులకు కక్కుర్తి పడుతున్నారని సమాచారం. డబ్బులు ఇస్తే వైకల్యం లేకపోయినా ధ్రువపత్రాలను ఇస్తున్నారని తెలిసింది. డబ్బులు ఇవ్వకపోతే అర్హులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. శింగనమల, అనంతపురం ఆసుపత్రులలో జరిగిన రీ వెరిఫికేషన్‌లో అనర్హులకు న్యాయం, అర్హులకు అన్యాయం చేస్తూ ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు.

పైసలే ప్రామాణికం..

శింగనమల ఆసుపత్రిలో ఎముకలకు సంబంధిత వైకల్య ధ్రువపత్రాల రీ వెరిఫికేషన్ జరిగింది. ఇక్కడ 800 మందికిపైగా దివ్యాంగులకు సంబంధించిన సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ జరిగింది. ఇతర జిల్లాకు చెందిన డాక్టర్లు ఈ ధ్రువపత్రాలను పరిశీలించారు. ఇక్కడ 90 శాతం వైకల్యం ఉన్నవారికి 40 శాతం ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆసుపత్రిలో దళారీలు చక్రం తిప్పారని ప్రచారం జరుగుతోంది. స్థానిక నాయకులు కొందరు వైద్యులకు కాసులు ముట్టజెప్పి.. అనర్హులను అర్హులుగా చూపించేలా మాయ చేశారని సమాచారం. పైసలు ముట్టజెప్పినోళ్లు క్యాంపునకు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. దళారీలు చెప్పిన వెంటనే వారికి పర్సెంటేజీ వేసి పంపించారని సమాచారం. డబ్బులు ఇచ్చినవారికి 40 శాతం వైకల్యం ఉన్నా 90 శాతం ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయి. పైసలు ఇవ్వనివారికి పర్సెంటేజీని పూర్తిగా తగ్గించి, అన్యాయం చేశారని అంటున్నారు. అనంతపురంలో మాట, వినికిడి లోపం, మానసిక వైకల్యం ఉన్నవారి సర్టిఫికెట్లను పరిశీలించారు. అక్కడ సైతం దళారీలే కీలకంగా మారి, డబ్బులతో వ్యవహారం నడిపించారని ఆరోపణలు వస్తున్నాయి. బాధితులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు అన్యాయం జరిగిందని, విచారించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అర్హులకు న్యాయం జరుగుతుంది...

డాక్టర్ల తీరు కారణంగా అర్హులకు అన్యాయం జరిగిన విషయం నా దృష్టికి వచ్చింది. అర్హులకు ఖచ్చితంగా న్యాయం చేస్తాం. నోటీసులు అందుకున్న లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మరోసారి పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వైసీపీ పాలనలో బోగస్ సర్టిఫికేట్లు ఇచ్చినందుకే రీ వెరిఫికేషన్ జరుగుతోంది. అనర్హులను మాత్రమే జాబితా నుంచి తొలగిస్తాం. వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మవద్దు.

-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

అర్హత ఉన్నా తొలగించారు..



నాకు పోలియో కారణంగా చిన్నతనం నుంచి వైకల్యం ఉంది. దివ్యాంగుల పింఛన్ కింద రూ.6 వేలు వచ్చేది. కానీ నాలుగు నెలలు కింట శింగనమల ఆసుపత్రిలో జరిగిన రీ వెరిఫికేషన్‌లో నా సర్టిఫికెట్‌ను రద్దు చేశారు. దిక్కుతోచక ఎంపీడీఓ కార్యాలయం చుట్టు తిరుగుతున్నాను. నాకు పింఛన్ రాకపోతే ఆకలితో అలమటించాల్సిందే. -ధరణి, అలంకరాయునిపేట, శింగనమల

అనర్హులకు ఇచ్చారు..



శింగనమలలో జరిగిన దివ్యాంగుల ధ్రువపత్రాల రీ వెరిఫికేషన్‌లో ఎక్కువ శాతం డాక్టర్లు డబ్బులు తీసుకుని పర్సెంటేజీ వేశారరు. శింగనమలలోనే నిత్యం పనులకు వెళ్లేవారికి వైకల్యం ఉన్నట్లు ధ్రువపత్రాలు ఇచ్చారు. డబ్బులు ఇవ్వని కారణంగా అర్హులకు అన్యాయం చేశారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి. -విజయ్‌కుమార్, శింగనమల

డీఎస్సీ మెరిట్ లిస్టు వచ్చేసిందోచ్..

డీఎస్సీ, విద్యాశాఖ వెబ్‌సైట్లలో జాబితా

లాగిన్ ఐడీల ద్వారా అభ్యర్థులకు కాల్‌లెటర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్టును రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. మెగా డీఎస్సీ, విద్యాశాఖ వెబ్‌సైట్లలో జాబితాలను ఉంచినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు సంబంధించిన సమాచారంతోపాటు జోనల్‌స్థాయి మోడల్ స్కూళ్ల పీజీటీ, టీజీటీ పోస్టులకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. కేటగిరీ పోస్టులకు సంబంధించి జోన్ ఆఫ్ కన్ఫర్మేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా కాల్‌లెటర్లు పంపనున్నట్లు రాష్ట్రఅధికారులు తెలిపారని డీఈఓ వెల్లడించారు. అపుడు అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌ద్వారా కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో కనబరచిన మేరకు నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల జారీచేసిన కుల ధృవీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకుని, మూడుసెట్ల జిరాక్స్ కాపీలు, 5 ఫొటోలతో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు. అంతకుముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

అంతా గుట్టుగా..!

● డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో జాగ్రత్తలు
● సమాచారం బయటకు పొక్కకుండా చర్యలు
● 25న వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు (వివరాలు 6వ పేజీలో...)

వైసీపీ అక్రమాలపై విజిలెన్స్..

అనంత నగర పాలక సంస్థలో కలకలం (6లో...)

గొడవ గొడవ..!

హుసేన్‌పురంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ
ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకుడు బాబురెడ్డికి గాయాలు
పరస్పరం ఫిర్యాదు.. కేసుల నమోదు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు బాబురెడ్డి, మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు/హిందూపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకుడు బాబురెడ్డి వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుసుకుంది. ఎంపీపీ స్వగ్రామం హుసేన్‌పురంలో ఈ ఘర్షణ చోటుసుకుంది. ఎంపీపీ కవ్వింపు చర్యలకు పాల్పడి దాడి చేశారని బాబురెడ్డి వర్గీయులు ఆరోపించారు. గుడికి వెళ్లి ఇంటికి వస్తుండగా దారి కాచి తనపై బాబురెడ్డి, అతని వర్గీయులు దాడిచేశారని ఎంపీపీ ఆరోపించారు. ఈ ఘర్షణలో ఎంపీపీ, బాబురెడ్డి ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స కోసం ఎంపీపీ హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. బాబురెడ్డి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకి వెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని చిలమత్తూరు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. కొన్నేళ్లుగా రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పాత కక్షల కారణంగానే ఈ గొడవ జరిగిందని సమాచారం. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున బాబురెడ్డిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో బాబురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

రోడ్డుపై బైఠాయింపు

ఎంపీపీని వైసీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక, నాయకులు వేణురెడ్డి తదితరులు ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. వారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. 30 యాక్ట్‌ను ఉల్లంఘించినందుకు (మిగతా 6లో..)

గర్భిణి మృతిపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

అనంతపురం వైద్యం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మరణించడంపై పత్రికల్లో వచ్చిన కథనానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈనెల మూడో తేదీన బుక్కరాయసముద్రం మండలం చెదళ్ల గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి రాధిక అబార్షన్ చేస్తున్న సమయంలో మృతి చెందారు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి భర్త, బంధువులు ఆరోపిస్తూ ఆందోళన చేశారు. ఈ విషయాలు పత్రికల్లో ప్రధానంగా ప్రచురితమయ్యాయి. వీటిని పరిశీలించిన ఎన్‌హెచ్‌ఆర్సీ కేసును సుమోటోగా తీసుకుంది. గర్భిణి మృతి విషయంలో తీసుకున్న చర్యలు, దర్యాప్తు స్థితి తదితర వివరాలను నివేదిక రూపంలో రెండు వారాల్లో సమర్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అనంతపురం ఎస్పీలను ఆదేశించింది. కాగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆ ప్రైవేటు ఆస్పత్రిని ఇదివరకే సీజ్ చేశారు.

జలకళ..!



బుడ్డారెడ్డిపల్లి వద్ద నిండిన ఫాంపాండ్

● కూటమి ప్రభుత్వం రాగానే రూ.2కోట్లతో పనులు
● విరివిగా చెక్‌డ్యాంలు, ఫాంపాండ్ల తవ్వకాలు
● వర్షాలకు నిండిన చెక్‌డ్యాంలు, కుంటలు
● బోరుబావుల్లో పెరిగిన భూగర్భ జలాలు



బుడ్డారెడ్డిపల్లి వద్ద చెక్ డ్యాంలో నీరు

ధర్మవరం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లో జలకళ సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వాటర్‌షెడ్ ప్రాజెక్టు పథకం కింద నిర్మించిన చెక్‌డ్యాంలు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు ఊపందుకున్నాయి. కొండ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించడంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు నీరుచేరి పొంగిపొర్లాయి. పంట పొలాల్లో ఫాంపాం డ్లు, కుంటలు తవ్వించారు. భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడే పనులు చేపట్టారు. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, తనకంటివారిపల్లి, నేలకోట, నేలకోట తండా (మిగతా 6లో...)

సిద్దేశ్వరుడి దర్శనం.. అదృష్టం

సినీ నటుడు మంచు మనోజ్

అమరాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హేమావతిలో మానవాకృతిలో సిద్దేశ్వరున్ని దర్శించుకోవడం చాలా అదృష్టమని సినీనటుడు మంచు మనోజ్ పేర్కొన్నారు. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన తన భార్య భూమా మౌనికరెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఉమాదేవి దంపతులతో కలిసి శుక్రవారం సందర్శించారు. వారికి హేమావతి పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మనోజ్ దంపతులు దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. భైరవీశ్వరుడు, దొడ్డేశ్వరుడు దేవాలయాలను కూడా సందర్శించారు. దేవాలయ విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. ఈఓ నరసింహరాజు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, టీడీపీ నాయకులు కుమారస్వామి, రామచంద్రప్ప, జయకుమార్, తిప్పజ్జ, కృష్ణమూర్తి, ఓంకారస్వామి, శివకుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



సిద్దేశ్వర స్వామి సన్నిధిలో మంచు మనోజ్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1094 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



బీజేపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు

పదవులు



కె చిరంజీవిరెడ్డి



కాపు రామచంద్రారెడ్డి



సందిరెడ్డి శ్రీనివాసులు



గుడిసె దేవానంద్

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు కీలక పదవులు దక్కాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, కదిరికి చెందిన గుడిసె దేవానంద్, కార్యదర్శిగా సందిరెడ్డి శ్రీనివాసులు, విభాగాల రాష్ట్ర కన్వీనర్‌గా కె చిరంజీవిరెడ్డిలను నియమించారు. తమకు నూతన కార్యవర్గంలో స్థానం కల్పించిన అధినాయకత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, కార్యదర్శి డాక్టర్ పోగుల నాగేంద్రబాబులు రాష్ట్ర కమిటీకి ఎంపికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ అక్రమాలపై

విజిలెన్స్..

అనంత నగర పాలక సంస్థలో కలకలం

డంపింగ్‌యార్డు



గత ఐదేళ్లలో చేసిన పనులు, బిల్లులపై విచారణ

అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగర పాలక సంస్థలో అప్పటి అధికారులు, పాలకులు ఆడిందే ఆటగా సాగిందన్నది బహిరంగ రహస్యమే. దోచుకోవడం, జేబు నింపుకోవడమే లక్ష్యంగా వ్యవహారాలు సాగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లీచింగ్ చల్లకనే చల్లినట్లు, పనిముట్లు కొనుగోలు చేయకనే రూ.లక్షలాది రూపాయల బిల్లులు చేసుకుని ఇష్టారాజ్యంగా నిధులను జేబుల్లోకి వేసేసుకున్నారు. ఇలా.. కోట్ల రూపాయలు స్వాహా చేశారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించడంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. దీంతో అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి మొదలైంది. విజిలెన్స్ అధికారులు కూపీ లాగితే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 2019-24 సంవత్సరాల మధ్య కొనుగోలు చేసిన పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డు నిర్వహణ, నగరంలో సుందరీకరణ పనులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు అనే 6 అంశాలపై విచారణ చేస్తున్నారు.



బ్లీచింగ్ పౌడర్

పంచేసుకున్నారు..

ఇబ్బడిముబ్బడిగా తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం రూ.లక్షల్లో కమీషన్లు బొక్కేయడం అప్పట్లో యథేచ్ఛగా సాగింది. వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచింది. ఇలా నగర పాలక సంస్థలో వైసీపీ ఐదేళ్ల పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. పనిముట్ల కొనుగోలుకు రూ.30లక్షలు, బ్లీచింగ్ పౌడర్‌కి రూ.67లక్షలు, సుందరీకరణకు రూ.6 కోట్లు, డంపింగ్ యార్డు నిర్వహణకు రూ.23 కోట్లు మంజూరు చేయగా.. రూ.12కోట్లు అప్పట్లోనే చెల్లించారు. ఐదేళ్లలో రూ.30కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పట్లో డీఈగా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో రూ.కోట్ల అవినీతిలో భాగస్వామి అయిన ఆ అధికారిని తిరిగి ఇక్కడ ఎలా చేర్చుకుంటారనే అంశంపై ఏఎంసీలో జోరుగా చర్చ సాగుతోంది.

పనులు చేయకనే రూ.23కోట్లు స్వాహా

గత వైసీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేసింది. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్భాలు పలికినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. చెత్త తరలింపు పేరుతో అప్పట్లో రూ.23కోట్ల మేర బిల్లులు చేసుకుని, మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. అప్పట్లోనే ఒకే సమయంలో రూ.12 కోట్ల బిల్లులు చెల్లించారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పొరేటర్లే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం. ఈ వ్యవహారాల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ అధికారులు, వైసీపీ నేతల్లో అలజడి రేపుతోంది.

విజిలెన్స్ విచారణ నిజమే



మున్సిపల్ కార్పొరేషన్‌లో విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న విషయం వాస్తవమే. విజిలెన్స్ అధికారులు అడిగిన అన్ని వివరాలు అందజేస్తున్నాం. విచారణకు సహకరిస్తున్నాం.

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

మనీమంతుడు...!

విధి నిర్వహణలో ఆయన స్టైలే వేరు

- జిల్లా కేంద్రంలో ఉంటూనే 'సెటిల్మెంట్లు'
- చుట్టపుచూపుగా కంబదూరుకు రాక
- పైసలిస్తే ఏపనైనా క్షణాల్లో పూర్తి
- ఎంపీడీఓ ఆఫీసులో ఓ అధికారి తీరుపై విమర్శలు



కంబదూరు మండల పరిషత్తు కార్యాలయంలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసే ఓ అధికారి స్టైలే వేరు. మ(ప)ని మంతుడిగా పేరు గడించి, తనను ప్రశ్నించే వారు లేరన్న ధైర్యంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా విధులు నిర్వహిస్తున్నాడు. జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ వారానికి ఒకటి , రెండు రోజులు మాత్రమే విధులకు చుట్టపుచూపుగా వస్తున్నారు. మిగతా రోజుల్లో అనంతపురంలోనే ఉంటూ అక్కడే అన్ని సెటిల్మెంట్లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు భారీగా ఉంటున్నాయి. ఆ అధికారితో పని ఉన్న వారు ఎప్పుడు ఫోన్ చేసినా 'అనంతపురంలో మీటింగులో ఉన్నా, మళ్లీ ఫోన్ చేస్తా' అని సమాధానం ఇస్తున్నారు. మళ్లీ ఆయన ఫోన్ చేస్తారేమోనని ఎదురుచూడటం అమాయక ప్రజల వంతైంది.

అంతా ఆయన చెప్పినట్లే..

ఏ ఉన్నతాధికారి కంబదూరు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినా, తనమాటలు, చేష్టలతో అతడిని బుట్టవేసుకుని వారు తాను చెప్పినట్లు వినేలా చేసుకుంటాడు. మంచి పని మంతుడిగా పేరు ఉండటంతో అధికారులు కూడా ఆయన చెప్పినట్లు చేస్తుంటారు. ఈ సానుకూలతల తో ఆయన కార్యాలయానికి చుట్టపుచూపుగా వస్తున్నట్లు సమాచారం. ఆఫీసులో ఎప్పుడు చూసినా ఆయన కుర్చీ ఖాళీగానే కనిపిస్తుంది. ఆయన ఆఫీసుకు ఎప్పుడు వస్తారో అక్కడి సిబ్బందికి కూడా తెలియని పరిస్థితి. ఆయనతో పని ఉన్నవారు మాత్రం అనంతపురం వెళ్లాల్సిందే.

డబ్బులిస్తే ఏ పనైనా..!

డబ్బులిస్తే ఆ అధికారి ఏపనైనా క్షణంలో చేసేస్తాడన్న పేరుగడించా డు. ముఖ్యంగా సర్పంచులతో కుమ్మక్కై నిధులన్నీ పక్కదారి పట్టించడంలో వారికి దారి చూపినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీల సభ్యులతో ఆ అధికారి కలిసిపోయి, వారి పనులు చక్కబెడుతూ, తన పేరు బయట పెట్టవద్దని చెబుతూ డబ్బులను తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా సొమ్ము లివ్వాల్సిందే అనే ప్రచారం సాగుతోంది. ఆ అధికారి తన విధులకు సంబంధించిన కంప్యూటర్, రికార్డులన్నీ కూడా అనంతపురంలో పెట్టుకుని అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంబదూరు మండల పరిషత్తు కార్యాలయంలో గతంలో పని చేసిన ఓ అవినీతి అధికారి, ఇక్కడ పనిచేసే ప్రస్తుత అధికారి ఇద్దరూ మిలాఖత్ అయ్యారు. ఎక్కడెక్కడ ఏ పనులు చేయాలో, ఎలా నిధులను స్వాహా చేయాలో ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అధికారి అవినీతికి అడ్డుకట్ట వేసే వారే కరువ య్యారు. ఉన్నతాధికారులకు తెలిసినా ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆ అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వారంలో రెండు రోజులు నిజమే: సూర్యనారాయణ, ఎంపీడీవో, కంబదూరు

కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి వారంలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్న మాట వాస్తవమే. ఆ అధికారి వద్ద పనులు జరగాలంటే డబ్బులు ఇవ్వాలనే విషయం మా దృష్టికి రాలేదు. తాము డబ్బులిచ్చినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ అధికారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

అంతా.. గుట్టుగా..!

జాగ్రత్తగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సమాచారం బయటకు పొక్కకుండా చర్యలు

25న ప్రారంభం కానున్న ప్రక్రియ

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల విషయంలో రాష్ట్ర విద్యాశాఖ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి ప్రక్రియ అత్యంత గోప్యంగా చేపడుతోంది. అందులో భాగంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో కొన్ని కమిటీలు వేసి అర్హత సాధించిన అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి చేయించేవారు. ముందుగానే ఏ సబ్జెక్టుకు ఏ టీమ్ సభ్యులు ఉన్నారో తెలిసిపోయేది. అందులో అనుకూలమైన వారితో సర్టిఫికెట్లలో కొన్ని పొరపాట్లు ఉన్నా ఓకే చేయించుకుని వెళ్లేవారనే ఆరోపణలు ఉన్నాయి. నాన్‌లోకల్ వారు లోకల్‌గా చదివినట్లు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందేవారు. 2008 డీఎస్సీలో ఇలాగే కడప జిల్లాకు చెందిన 30 మందికిపైగా లోకల్‌గా చదివినట్లు సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందగా.. వాటిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో పునఃపరిశీలన చేయించి, ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా వెరిఫికేషన్‌లో గోప్యత పాటిస్తున్నారు. అభ్యర్థులకు ఎంపికైనట్లు పంపిన మెసేజ్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన తేదీ, కేంద్రం, కమిటీ వివరాలు పంపారు. జిల్లాలో వెరిఫికేషన్‌కు 16 బృందాలను నియమించారు. మెసేజ్‌లో ఇచ్చిన మేరకు ఆయా బృందాల సభ్యుల వద్దకెళ్లి తమ సర్టిఫికెట్లను అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ వెంటనే ఆన్‌లైన్‌లో ఓకే అయిపోతుంది. అందులో సమస్యలు ఉత్పన్నమైతే వెరిఫికేషన్ చేసిన బృందం సభ్యులు బాధ్యత వహించాల్సి ఉం టుంది. సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 25న ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ అలుమూరు రోడ్డులో గల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో పరిశీలనకు ఏర్పాట్లు చేపట్టింది. డీఈఓ ప్రసాద్ బాబు, ఇతర కమిటీల సభ్యులు, ఐటీ విభాగ సిబ్బంది శుక్రవారం కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ, కమిటీ సభ్యులు

మెరిట్ లిస్టులోనూ ట్విస్టు

గతంలో ముందుగానే మెరిట్‌లిస్టు విడుదల చేసేవారు. ఏ రోస్టర్‌కు, ఎన్ని మార్కులకు పోస్టు వస్తుందో తెలిసిపోయేది. దీంతో కొందరు డీఈఓ కార్యాలయంలో పనిచేసే వారు దళారీలను రంగంలోకి దించి, ఎక్కడ వరకు ఎవరికి పోస్టు వస్తుందో తెలుసుకుని వారితో బేరసారాలు సాగించి జేబులు నింపుకునేవారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇలాంటి వ్యవహారానికి సంబంధించిన ఆడియో గతంలో బయటపడడంతో ఒకరిని సస్పెండ్ కూడా చేశారు. అందుకే ఈసారి ప్రతి ప్రక్రియను రాష్ట్రశాఖే చేపడుతోంది. ఇప్పటికే మెరిట్ ఆధారంగా అర్హత అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశారు. ఆ జాబితాలో కూడా పొరపాట్లకు తావులేకుండా జిల్లాల వారీగా విద్యాశాఖ ఉద్యోగులను రాష్ట్ర కార్యాలయానికి పిలిపించుకుని మెరిట్, రోస్టర్ ఆధారంగా కరెక్టుగా ఉన్నాయో.. లేదో.. పరిశీలించారు. ఆ ప్రక్రియ పూర్తి కావడంతో శుక్రవారం రాత్రి మెరిట్‌లిస్టు విడుదల చేశారు.

గొడవ గొడవ..!

(5వ పేజీ తరువాయి)

వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ రాజగోపాలనాయుడు తెలిపారు.

లోపల వేస్తారు.. అంతేకదా..?



రోడ్డుపై బైఠాయించిన వైసీపీ ఇన్‌చార్జి దీపిక తదితరులు

వైసీపీ నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసిన పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పురంలోని వైసీపీ నాయకుడు వేణురెడ్డి ఇంటికి వెళ్లారు. నిబంధనలు ఉల్లంఘించవద్దని సూచించారు. దీంతో వేణురెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'టీడీపీ నాయకులు ఏం చేస్తున్నారో చూశారు కదా..? అంతకు మించి మేము ఏమైనా చేస్తే ఏం చేస్తారు..? మహా అయితే లోపల వేస్తారు. అంతే కదా..?' అని మండిపడ్డారు. గతంలో వేణురెడ్డి ఇలాగే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైసీపీ వర్గీయులపై దాడులను సహించబోమని, ఇకపై చెయ్యికి చెయ్యి, తలకు తల అని హెచ్చరించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి హేయమైన చర్య: టీడీపీ

టీడీపీ నాయకుడు బాబురెడ్డిపై ఎంపీపీ పురుషోత్తంరెడ్డి వర్గీయుల దాడి హేయమైన చర్య అని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున బాబురెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని అన్నారు. ఆ దాడుల్లో బాబురెడ్డి వర్గీయులు తీవ్రంగా గాయపడి, నెలరోజులు కోలుకోలేదని అన్నారు. అప్పటి విధానాన్నే ఎంపీపీ కొనసాగిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ అభివృద్ధి చేస్తున్నారని, దాన్ని జీర్ణించుకోలేక వైసీపీ వర్గీయులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తాము గొడవలకు దూరంగా ఉంటామని, కావాలని రెచ్చగొడితే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు యాదవ్, బేకరీ గంగాధర్, గౌరీ శంకర్, లక్ష్మీనారాయణ యాదవ్, విశ్వనాథరెడ్డి, మంజు, చంద్ర, గంగాధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

స్త్రీనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



స్త్రీ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కనగానపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్త్రీ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. మండలంలోని 513 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.4.46 కోట్ల రుణాలకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వంటింటికే పరిమితమైన మహిళలను చైతన్య పరచి కుటుంబాలను స్వశక్తితో పోషించే స్థాయికి తెచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి పథకం ప్రారంభమవుతుందనీ, 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఏపీఎంలు హనుమేష్, హేమలత, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హైడాతాన్-2025లో ఎస్కేయూకు మొదటి బహుమతి


అనంతపురంరూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైడాతాన్-2025 పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మొదటి బహుమతి దక్కినట్లు వైస్‌చాన్సలర్ అనిత తెలిపారు. పోటీల్లో పాల్గొని బహుమతి సాధించిన విద్యార్థుల బృందాన్ని ఆమె రిజిస్ట్రార్ రమేష్‌బాబు తో కలిసి శుక్రవారం అభినందించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం-డీట్ భాగస్వామ్యంతో గుర్తింపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గర్వం అవార్డ్స్ -సీజన్4లో భాగంగా హైడాతాన్-2025 పోటీలను జూన్ 26నుంచి ఆగస్టు 21 వరకు ఐదు దశల్లో నిర్వహించారన్నారు. ఫైనల్ రౌండ్ పోటీలు 21న హైదరాబాదులోని టీ హబ్‌లో జరిగాయన్నారు. ఇందులో వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం ఇన్నోవేషన్ ఇంటిగ్రేటెడ్ సొల్యూషన్స్‌లో మొదటి స్థానంలో సాధించినట్లు వెల్లడించారు. దీంతో వారికి రూ.35వేల నగదు బహుమతి దక్కినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

జలకళ!

(5వ పేజీ తరువాయి)



ఏలుకుంట్ల వద్ద నిండిన కుంట

పరిధిలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు పథకం అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ గ్రామాల పరిధిలో రూ.2 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. చెక్ డ్యాంలు, ఫాంపాండ్లు, కుంటలు, నారవులకు రాతికట్టడాలు తదితర పనులు చేపట్టారు.

పెరిగిన భూగర్భ జలాలు

వాటర్‌షెడ్ పథకంలో చేపట్టిన పనులతో భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో సమృద్ధిగా నీరు రావడంతో పంటల సాగుకు అనుకూలంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుడ్డారెడ్డిపల్లిలో బోరుబావుల నుంచి నీరు ఉబికివస్తోంది. గ్రామాల చుట్టూ కొండలు ఉండటంతో గతంలో నీరు అందుబాటులో లేక పంటలు సాగుచేసుకోలేకపోయామని, ప్రస్తుతం వాటర్‌షెడ్ పథకంలో చేపట్టిన చెక్‌డ్యాంలు, ఫాంపాండ్లు, కుంటలు ఏర్పాటు చేసుకోవడంతో అవి నిండి జలకళను సంతరించుకున్నాయని రైతులు చెబుతున్నారు. బోరుబావుల్లో నీరు పెరగడంతో రైతులు మామిడి, చీనీ, వేరుశనగ, కూరగాయలు పండించుకుంటున్నారు.

వాటర్‌షెడ్ పథకం రైతులకు వరం



వాటర్‌షెడ్ పథకం రైతులకు వరంలాగా నిలుస్తోంది. మా గ్రామంలో ప్రతిరైతు పొలంలో నీరునిల్వ ఉండేందుకు ఫాంపాండ్లు తవ్వించాం. కొండ ప్రాంతాల్లో చెక్ డ్యాంలు, డకౌట్‌పాండ్లు నిర్మించాం. రైతుల సహకారంతో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. చెక్‌డ్యాంలు, కుంటలు వర్షపు నీటితో నిండడంతో భూగర్భ జలాలు పెరిగి రైతులు వరి, చీనీ, మామిడి, అరటి పంటలు సాగుచేసుకుంటున్నారు. బోర్లలో నీరు పెరగడంతో రైతులు పనులు చేసుకుంటూ ఆనందంగా ఉన్నారు.

- తిరువీధుల సుధాకర్‌చౌదరి, వాటర్‌షెడ్ చైర్మన్, ఏలుకుంట్ల

భూగర్భ జలాలు పెరిగాయి



గతంలో నీరులేక మా గ్రామంలో కరువుతో అల్లాడేవాళ్లం. వర్షాలు వచ్చినా నీరు నిల్వ ఉండేది కాదు. ఎక్కడికో లోతట్టు ప్రాంతాలకు నీరంతా వెళ్లిపోయేది. దీంతో మా ఊరిచుట్టూ నీరు నిలబడక బోర్లలో నీటి మట్టం తగ్గేది. వాటర్‌షెడ్ పనుల ద్వారా మా గ్రామం చుట్టూ చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు తీయడంతో వర్షాలకు నిండాయి. ఆ నీటిని చూసి చాలా ఆనందం వేసింది. భూగర్భ జలాలు పెరిగాయి.

- జయప్రకాష్‌రెడ్డి, రైతు, బుడ్డారెడ్డి పల్లి

ఎంటెక్, ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ నాగప్రసాద్‌నాయుడు, తదితరులు


అనంతపురంరూరల్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయం పరిధిలో జూలై నెలలో నిర్వహించిన ఎం.టెక్, ఎం.ఫార్మసీ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఎం.టెక్ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంటెక్ ఒకటి, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నాగప్రసాద్ నాయుడు తదితరులు విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య శివకుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అంకారావు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.20, సరాసరి ధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,150 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

భార్య, బిడ్డ లేని జీవితం ఎందుకని..

వృద్ధుడి ఆత్మహత్య



అంజినప్ప (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండాల బండ వీధికి చెందిన బొక్కసం అంజినప్ప (68) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వానవోలు రహదారిలో పెట్లగుండపల్లి సమీపంలోని పొలంలో చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న అంజినప్ప మృతదేహాన్ని పశువుల కాపర్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి రెండో కుమారుడు శ్రీనివాసులు (32) అనారోగ్యంతో ఈఏడాది ఫిబ్రవరి 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతితో కుంగిపోయిన అంజినప్ప భార్య సాకమ్మ (63) అతడి సమాధి వద్దే మార్చి 10న యాసిడ్ తాగింది. ఆమె బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 22న మృతి చెందారు. నెల రోజుల వ్యవధిలోనే కుమారుడు, భార్య మృతి చెందడాన్ని అంజినప్ప జీర్ణించుకోలేకపోయాడు. మానసికంగా తీవ్ర వేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థలం అమ్మి భార్య చికిత్స కోసం చేసిన అప్పులు చెల్లించాడు. కుమారుడు మృతితో వితంతువైన కోడలు పేరున ఇంటిని రాశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి పెళ్లైన కుమారుడు ఒకరు, పెళ్లి కావాల్సిన కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం



స్వప్న

బొమ్మనహాళ్, ఆగస్టు22, (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై బొమ్మనహాళ్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రంలోని మొలకాల్మూర్ తాలుకా రాంపురం గ్రామానికి చెందిన స్వప్న (14) బొమ్మనహాళ్‌లో నెల రోజుల కిందట తప్పిపోయినట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. రాంపురానికి చెందిన లమ్మని సంతోష్ కుటుంబ సభ్యులతో నెల రోజుల కిందట బొమ్మనహాళ్‌కు కొలిమి పనులకోసం వచ్చారు. గత నెల 23న స్వప్న బహిర్భూమికి వెళ్లి వస్తాను అని చెప్పి తిరిగి రాలేదన్నారు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శీనప్ప (ఫైల్)

కూడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివరాంపేట గ్రామానికి చెందిన రైతు బోయ శీనప్ప(35) అప్పుల బాధతో ఉరి వేసుకున్నాడు. శీనప్పకు రెండెకరాల పొలం ఉంది. దీనికితోడు నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని కంది, ఆముదం, పప్పుశనగ పంటలను సాగు చేసి నష్టపోయాడు. రూ.5 లక్షలకు పైగా అప్పులు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన భార్య అరుణజ్యోతి తిరిగి వచ్చేసరికి మృతిచెందాడు. ఇరుగుపొరుగు సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు విన్నవించారు.

ప్రేమ పెళ్లికి నిరాకరించారని

యువకుడి ఆత్మహత్య



గుణ(ఫైల్)

బత్తలపల్లి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవంపల్లికి చెందిన యువకుడు గుణ (20) ప్రేమ పెళ్లికి బంధువులు నిరాకరించారన్న మనస్తాపంతో శుక్రవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాఘవంపల్లికి చెందిన నరసింహుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గుణ పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే వ్యవసాయం చేసుకుంటుండేవాడు. బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. దీంతో గుణ మనస్తాపం చెందాడు. తోటలోనే వారి ఇల్లు ఉండేది. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో పడుకున్న గుణ తోటలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. ఉదయం అతడు కనిపించకపోవడంతో కుటుంబీకులు తోటలో వెతకగా.. మామిడి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుణ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ.. ఓ కుట్ర

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ.. కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాల సామాజికవర్గంపై కక్షసాధింపుతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వైఖరిని ప్రకటించాలన్నారు. కులమతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతిని బీజేపీ అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాలకుంట కేశవప్రసాద్, పెద్దిరెడ్డిపల్లి అరవిందకుమార్, నల్లూరి శంకర్‌బాబు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

ఐదుగురిపై కేసు

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో లారీ డ్రైవర్‌పై దాడిచేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్పల మండలం దామలూరు గ్రామానికి చెందిన గురుప్రసాద్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. 8 ఏళ్లక్రితం మదనపల్లి నుంచి దామలూరుకు వలస వచ్చాడు. ఏడాది క్రితం తాడిపత్రికి చెందిన జోసెఫ్‌తో రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. గురుప్రసాద్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా జోసెఫ్ వద్ద తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదు. దీంతో జోసెఫ్.. పలుమార్లు ఫోన్ చేసినా డబ్బు సర్దుబాటు కాలేదని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 18న గురుప్రసాద్ లారీలో సిమెంట్ లోడ్ చేసుకుని తాడిపత్రి నుంచి బెంగళూర్‌కు బయల్దేరాడు. రాత్రి 10.30 గంటల సమయంలో ధర్మవరం మార్కెట్‌యార్డు వద్దకు రాగానే జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తి లారీని అడ్డగించి గురుప్రసాద్‌ను కిందకు దింపి, దాడిచేశారు. వారి నుంచి గురుప్రసాద్ తప్పించుకుని, మదనపల్లికి వెళ్లిపోయాడు. దీంతో దాడిచేసిన జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురుప్రసాద్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

మానవాళికి ఆదర్శం.. శ్రీకృష్ణుడి జీవితం

మంత్రులు సత్యకుమార్, సవిత

శ్రీకృష్ణుడి మందిర నిర్మాణానికి భూమి పూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి జీవితం సర్వమాన వాళికి ఆదర్శమని మంత్రులు సత్యకుమార్, సవిత పేర్కొన్నారు. స్థానిక నక్కలగుట్ట కాలనీలో శ్రీకృష్ణుడి మందిర నిర్మాణం భూమిపూజ కార్యక్రమంలో శుక్రవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి నిజ జీవితంలో ఆచరించిన విధానాలు నేటి మానవళికి అనుసరణీయమన్నారు. అన్ని కళలు సంపూర్ణంగా తెలిసినా మిడిసి పడక ప్రజలను గౌరవిస్తూ, ధర్మపాలన చేశాడని కొనియాడారు. కురుక్షేత్ర యుద్ధాన్ని తానొక్కడే ముగించే సత్తా ఉన్నా తను సూత్రధారిగా మారి అర్జునుడి చేత ధర్మయుద్ధం చేయించి దుష్టసంహారం గావించాడన్నారు. హితోపదేశం పేరుతో సర్వమానవాళికి భగవద్గీత అనే గొప్ప గ్రంథాన్ని అందించాడన్నారు.

2024లో ధర్మమే గెలిచింది : మంత్రి సవిత

2024లో జరిగిన ఎన్నికల్లో అధర్మంపై ధర్మం గెలిచిందని మంత్రి సవిత తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అంధకారం, అప్పుల్లో నెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. శ్రీకృష్ణుడు బోధించిన గీతాసారాన్ని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటబట్టించుకుని ధర్మపాలన చేస్తున్నట్లు కితాబునిచ్చారు. పెనుకొండలో ఆగిన ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుందన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి : బీకే పార్థసారథి, ఎంపీ

బీసీ కులాలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. అగ్ర కులాలను చూసి, అభివృద్ధి చెందినవారిని చూసి ఈర్ష్య పడరాదన్నారు. తమ పిల్లలను చదివించుకుని వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా ఎదగడంతోపాటు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

నిర్మాణాలకు విరాళాలు

ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంతోపాటు కల్యాణమండపం నిర్మాణం కోసం మంత్రి సత్యకుమార్ రూ.5లక్షలు, మంత్రి సవిత రూ.5లక్షల 116 ప్రకటించారు. ఎంపీ బీకే పార్థసారథి రూ.20 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య రూ.5లక్షలు, ముదిగుబ్బ ఆదినారాయణ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మంత్రి సవిత అభ్యర్థన మేరకు 2027లోపు పెనుకొండలో అర్థాంతరంగా ఆగిన వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. అనంతరం వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణ, కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మహేష్, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహప్ప యాదవ్, అనంతపురంజిల్లా అధ్యక్షుడు వెంకటసూరి, రాష్ట్ర సంఘం నాయకులు నారాయణ, నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరాముడు, కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జయసూర్య, జాతీయ యాదవ సంఘం నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-తిరుపతి (07011) ప్రత్యేక వీక్లీ రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07012) సెప్టెంబరు 6 నుంచి 27 వరకూ శనివారాలలో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట, స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. తిరుపతి-హిసర్ ప్రత్యేక రైలు (07717) అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకూ బుధవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07718)ను ఈ నెల అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకూ ఆదివారాలలో నడుపుతామన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మేడ్చల్, కామారెడ్డి,నిజామాబాద్,బాసర, ధర్మబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, బస్మట్, హింగోళి, వాసిం, అకోలా, షేగావ్, మల్కాపూర్, భుస్వాల్, జల్‌గావ్, ధరన్‌గావ్, అమల్నేర్, నందుర్బార్, ఉద్నా, వడోదర, రత్లం, మాండ్‌సోర్, నీముచ్, చిత్తోర్‌ఘర్, బిల్వారా, బిజయ్‌నగర్, నాసిర్‌బాద్, అజ్మీర్, క్రిష్ణాఘర్, ఫులేరా, రింగస్, సికర్, నవాల్‌ఘర్, ఝుంజును, చిరావా, లోహారు, సదుల్‌పూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. నాందేడ్-ధర్మవరం (07189) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07190) సెప్టెంబరు 7 నుంచి 28 వరకూ ఆదివారాలలో నడుస్తుందన్నారు. ఈ రైలు ముద్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, అర్మూర్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్లు, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుతుందన్నారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06549) ఈనెల 26న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06550) ఈ నెల 27న, బెంగళూరు-బీదర్ (06530) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 28 వరకూ శుక్ర, ఆదివారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (06540) సెప్టెంబరు 6 నుంచి 29 వరకూ శని, సోమవారాలలో నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తాయన్నారు. యశ్వంతపూర్-ధన్‌బాద్ (06563) ప్రత్యేక రైలు ఈ నెల 23 నుంచి డిసెంబరు 27 వరకూ శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (06564) ఈ నెల 25 నుంచి డిసెంబరు 29 వరకూ నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, నరసింగ్‌పూర్, మదన్‌మహల్, కట్ని, సాట్నా, ప్రయాగరాజ్, మీర్జాపూర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బబువా రోడ్, ససరం, అనుగ్రహ నారాయణ్, గయ, కోడేర్మ, హజారీబాగ్, పరశ్‌నాథ్, గోమహ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

సెక్టోరల్స్ భర్తీ ఎప్పుడో..?

ఇంటర్వ్యూలు ముగిసినా తేలని తుది ఫలితం



ఇంటర్వ్యూలకు హాజరైన టీచర్లు (ఫైల్)

అనంతపురం విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష సెక్టోరల్స్ పోస్టుల భర్తీ మళ్లీ సందిగ్ధంలో పడింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన వరుస కథనాలకు జిల్లా అధికారులు స్పందించి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం ఆరు సెక్టోరల్స్ పోస్టులకు 71మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 24 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 47మందికి ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 42మంది హాజరయ్యారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసి 15రోజులు కావస్తున్నా పోస్టుల భర్తీ మాత్రం పూర్తి కాలేదు. ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే కలెక్టరుతో మాట్లాడి అభ్యర్థులను ప్రకటిస్తారని అందరూ ఊహించారు. ఇంటర్వ్యూల సమయంలో ఇన్‌చార్జ్ కలెక్టరుగా జేసీ శివనారాయణశర్మ ఉండేవారు. దీంతో ప్రక్రియ ముగుస్తుందని అనుకున్నారు. కానీ నియామకాల ప్రక్రియ జరగలేదు. అనంతరం శిక్షణకు వెళ్లిన రెగ్యులర్ కలెక్టరు వినోద్‌కుమార్ జాయిన్ అయ్యారు. దీంతో సెక్టోరల్స్ ఎంపిక కలెక్టరేట్‌లోనే ఉండిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరల్స్ భర్తీ ఎప్పటికి పూర్తవుతోందోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కలెక్టరేట్‌లో అప్పగించాం: శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

సెక్టోరల్స్ నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. ఇంటర్వ్యూకు హాజరైన 42 మంది వివరాల ఫైలు అసిస్టెంట్ కలెక్టరుకు అప్పగించాం. అక్కడ నుంచి అభ్యర్థుల ఎంపిక జాబితా రావాల్సి ఉంది.

పరిశ్రమలను స్థాపించండి: కలెక్టర్



సమావేశంలో కలెక్టర్, జేసీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో 61వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్ని శాఖల వారు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కల్పించాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని సూచించారు. 2020-23 పాలసీలో రెండు యూనిట్లకు రూ.2,60,71 సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్డీఎంను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీటీసీ వీర్రాజు, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ , ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

నిషేధిత జాబితాలోని 22ఏ, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి శుక్రవారం నిర్వహించారు. 22ఏకి సంబంధించిన32 క్లెయిమ్స్‌ను పరిశీలించారు. అందులో 25 ఆమోదించారు, మూడింటిని తిరస్కరించారు. నాలుగు దరఖాస్తులను పునఃపరిశీలించాల్సి ఉందని తెలిపారు. చుక్కల భూములకు సంబంధించి 26 క్లెయిమ్స్‌ను విచారించామని కలెక్టర్ తెలిపారు. అందులో 14 ఆమోదించామని, ఆరింటిని తిరస్కరించి, మరో ఆరింటిని పునఃపరిశీలించాలని ఆదేశించామని అన్నారు. 22ఏ, చుక్కల భూములకు సంబంధించి అనంతపురం రూరల్, కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, బెళుగుప్ప, శెట్టూరు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, పామిడి మండలాల పరిధిలో దరఖాస్తులను విచారించారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

అహుడా వైస్‌చైర్మన్, జేసీ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న శివనారాయణ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదనీ, కఠిన చర్యలు తీసుకుంటామని అహుడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. అహుడా కార్యాలయంలో శుక్రవారం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనధికార లేఅవుట్లలో మౌలిక వసతులు విద్యుత్తు, నీరు, రోడ్లు, మురుగు కాలవల నిర్మాణాలు చేపట్టబోమన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద ప్లాట్లకు అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్ పాల్గొన్నారు.

కదిరిలో గంజాయి ముఠా అరెస్టు

10 కిలోల సరుకు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ

కదిరి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా రవాణా చేసి, విక్రయిస్తున్న ముఠాను శ్రీసత్యసాయి జిల్లా కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి విలేకరుల సమావేశంలో శుక్రవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. కదిరి మండలంలోని కొండమనాయునిపాళ్యం గ్రామ సచివాలయం వద్ద గంజాయి ముఠా ఉన్నట్లు సమాచారం రావడంతో అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి, వారినుంచి 10కిలోల గంజాయి, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా మహారాష్ట్ర నుంచి అక్రమంగా గంజాయిని ఇక్కడికి తీసుకు వచ్చి.. చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిలో రూ.2 వేలకు కొనుగోలు చేసి, ఇక్కడ రూ.7 వేల నుంచి రూ.10వేలకు విక్రయిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడినవారిలో కదిరికి చెందిన ఆజాద్, మహమ్మద్ సోయాద్, షేక్ ఇర్షాన్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ అస్లాం, ఎస్ గౌస్ బాషా ఉన్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ఆజాద్.. గంజాయిని మహారాష్ట్రలోని ఫైజాపూర్‌లో రాజు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి, అక్కడి నుంచి రైలులో పుట్టపర్తికి తీసుకువస్తాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలలో కదిరికి వచ్చి, చిన్న ప్యాకెట్లుగా మారుస్తారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.500కు విక్రయిస్తుంటారు. గంజాయిని విక్రయిస్తున్న రాజును అరెస్టు చేసేందుకు మహారాష్ట్రకు ఓ బృందాన్ని పంపామని డీఎస్పీ తెలిపారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



చైత్రేష్



రాహిల్



సోహానా



నిక్కీ శ్రీరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఇటీవల పిఠాపురంలో నిర్వహించిన ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టిన చైత్రేష్, రాహిల్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సోహనా, నిక్కీ శ్రీ ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన వారు శనివారం నుంచి పిఠాపురంలో నిర్వహించే జాతీయ శిక్షణలో పాల్గొంటారనీ, అనంతరం పంజాబ్‌లోని లూధియానాలో జరిగే జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

హెచ్చెల్సీ ఏఈఈ ఆత్మహత్య

కుంగుబాటుతోనేనని తండ్రి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే నగర్‌లో శుక్రవారం రాత్రి హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్న సుమియా(32) మానసిక కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో సుమియా(32), ఆమె భర్త పామిడి మహమ్మద్ షఫీ(38) ఏఈఈలుగా పనిచేస్తున్నారు. ఆర్కె నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి మన్హా నాఫియా(3), మహిరా ఇరమ్(2) సంతానం. సుమియా కొంతకాలంగా హార్మోన్ల అసమతుల్యంతో మానసికంగా ఇబ్బంది పడుతుండేది. చికిత్స కూడా తీసుకుంటుండేది. వారంరోజులు ఆమె మాత్రలు వేసుకోలేదు. గురువారం ఆమె తల్లిదండ్రులు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రాత్రి సుమియా, ఆమె భర్త ఒక గదిలో, ఆమె తల్లిదండ్రులు, పిల్లలు మరో గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున సుమియా ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు ఆమె తండ్రి గుర్తించాడు. హుటాహుటిన కారులో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా... పరీక్షించిన డాక్టర్లు మరణించినట్లు నిర్ధారించారు. మానసిక వ్యాధితోనే మృతి చెందినట్లు సుమియా తండ్రి బాబా సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వచ్చే ఐదు రోజులు మోస్తరు వర్షం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటిగానీ, మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠంగా 33.4-34.2, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.4-24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 13-15కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయంపూట 69-74, మధ్యాహ్నం 40-50 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్

అనంతపురం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(ఆర్‌బీఈఓ) వైబీపీటీఏ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలోని యూరియా విక్రయదారులు, డీలర్లు, సరఫరాదారులు రైతులకు సక్రమంగా యూరియాను అందజేయాలన్నారు. యూరియా డీలర్లపైన ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. యూరియాను వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడం, స్టాకు ఉన్నా నో స్టాక్ బోర్డులు పెట్టడం వంటివి చేసి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

సమసమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

● రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం టౌన్/న్యూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతాయుతమైందని, సమసమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జర్నలిస్టుల మహాసభ జరిగింది. కార్యక్రమాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. సమాజంలో అవినీతి, సామాజిక రుగ్మతలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అక్రిడిటేషన్లకు సంబంధించి నూతన జీఓ 84ను విడుదల చేసిందని, త్వరలో అర్హులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని తెలిపారు. జాప్ అసోషియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు. పలువురు జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీబీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఏపీజీబీ అనంతపురం రీజనల్ మేనేజర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని పసులూరు గ్రామంలో శుక్రవారం బుక్కరాయసముద్రం ఏపీజీబీ ఆ ధ్వర్యంలో జన్‌సురక్షా పథకాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ హజరై మాట్లాడారు. జన్‌సురక్షా పథకం కింద ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలతో పేదలకు ఆర్థిక భద్రతను కల్పిస్తుందన్నారు. వీటితోపాటు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ముద్రా కింద రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తే... తిరిగి మళ్లీ రెట్టింపు రుణం ఇస్తామని అన్నారు. బీకేఎస్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఫీల్డ్ అఫీసర్ వెంకటేష్ తదితరులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంపై దాడికి ఆర్యవైశ్యుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్యులు

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ నగరంలోని ఆర్యవైశ్యులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక వైశ్య హాస్టల్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీకి తొలిసారిగా తమ సామాజిక వర్గానికి చెందిన మహిళ రేఖా గుప్తా సీఎంగా ఉండడం గర్వంగా ఉందన్నారు. ఆమెపై ఓ వ్యక్తి దాడికి పాల్పడడం చూస్తుంటే భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రికే భద్రత కరువైతే ఎలా..? అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చల్లా కృష్ణరంగయ్య, యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్, సంఘం జిల్లా అధ్యక్షుడు వెంటేష్, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు మేడా రమనాథ్ పాతూరు మహిళామండలి అధ్యక్షురాలు చల్లా స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'కొత్త పరీక్షతో నష్టమే ఎక్కువ'

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్ పరీక్షవిధానంవల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉందని గిరిజన ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు గుజ్జల శివయ్య, డెకావత్ రవీంద్రనాయక్ శుక్రవారం ప్రకటనలో మండిపడ్డారు. ఫార్మేటివ్ పరీక్షలు మొదలైనప్పటి నుంచి ఉపాధ్యాయులు బోధనకంటే మూల్యాంకనానికే పరిమితమై వస్తున్నారన్నారు. దీనివల్ల విద్యార్థులకు పాఠాలు జరగక అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రభుత్వం ఈకొత్త అసెస్‌మెంట్ పరీక్ష విధానాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డీడీఓ కార్యాలయానికి భవనం ఖరారు..



డీడీఓ కార్యాలయానికి ఖరారు చేసిన సచివాలయ భవనం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయానికి సంబంధించి ఎట్టకేలకు ఓ భవనాన్ని ఖరారు చేశారు. అనంతపురం రూరల్ రామక్రిష్ణ కాలనీలోని సచివాలయం-2 భవనం పైభాగంలో డీడీఓ కార్యాలయం నిర్వహించేలా శుక్రవారం నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులతో అనుమతి కూడా పొందనున్నట్లు జిల్లా పరిషత్ ఇంచార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇప్పటి నుంచే అక్కడ డీడీఓ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహించుకొనే వెసులుబాటు ఉందన్నారు. అయితే పంచాయతీరాజ్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అక్టోబర్-2 నాటికి అన్ని హంగులతో ఏర్పాటు చేయించి ఆ రోజున ప్రారంభించేలా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పలు ప్రాంతాల్లో డీడీఓ కార్యాలయానికి భవనాలు పరిశీలించామని, రూరల్ సచివాలయం-2 భవనం అనువుగా ఉండటంతో ఇక్కడ ఖరారు చేశామని చెప్పారు.

మూడు నెలల్లో రోడ్డు పనులు పూర్తవ్వాలి

● అధికారులు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

● అనంతపురం-తగరకుంట రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



బోగినేపల్లి సమీపంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి తగరకుంట వరకూ ఉన్న తారురోడ్డు మరమ్మతు పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను, కాంట్రాక్టరను ఆదేశించారు. మండలంలోని బోగినేపల్లి సమీపంలో జరుగుతున్న తారురోడ్డు పనులను శుక్రవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనంతపురం నుంచి తరగకుంట వరకు ఉన్న ఈ రోడ్డు బీ.యాలేరు గ్రామ సమీపంలో 14వ కి.మీ నుంచి 39వ కి.మీ వరకూ పూర్తిగా దెబ్బతిందన్నారు. సుమారు 25 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని 2021లో ప్రారంభించి 2023లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న తోపుదుర్తి సోదరులు కమీషన్ల కోసం బెదిరించడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపేశారని తెలిపారు. దీంతో గుంతల రోడ్డుతో ప్రజలు గత ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రోడ్డు పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించామన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. పనులు నాణ్యతగా చేపట్టి మూడునెలల్లో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, బోగినేపల్లి సర్పంచ్ ఉజ్జినప్ప, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివ, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పసల కిరణ్ ఈ ఏడాది జనవరి 5వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతను పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో రూ.5లక్షల ప్రమాదబీమా ఈ నెలలో మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.10లక్షలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారురాలు భర్త నరసింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దవెంకటరాముడు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి: వైసీపీ



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పింఛన్ల విషయంలో దివ్యాంగులకు న్యాయం చేయాలని, లేకపోతే వారితో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి రాగానే నాలుగు నెలలు మాత్రమే పింఛన్లు సక్రమంగా పంపిణీ చేశారన్నారు. అనంతరం పింఛన్లలో కోతలు ప్రారంభించారన్నారు. ఏళ్ల తరబడి పింఛన్లు పొందుతున్న వారిని కూడా అనర్హులుగా చెప్పడం ఏంటని ప్రశ్నించారు. రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల ఇబ్బందులు పెట్టడం దుర్మార్గమన్నారు. జిల్లాలో తాజాగా 9601 దివ్యాంగుల పింఛన్లు తొలగించారని తెలిపారు. దీనికి తోడు వైకల్యశాతం తగ్గించేందుకు 2314 మంది పింఛన్‌దారులకు కూడా నోటీసులు ఇచ్చారన్నారు. ఒక్క అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోనే 1008మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చారన్నారు. ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని దివ్యాంగులకు పింఛన్ పునరుద్ధరించాలన్నారు. లేకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అలాగే సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఈవిషయంపై ఎమ్మెల్యేను చంద్రబాబు మందలించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్టీఆర్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సాటి నటుడిగా పవన్‌కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు.

అర్హులందరికీ పింఛన్లు అందించాలి: సీఐటీయూ

రాప్తాడు: అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు అందించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. అర్హులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి రామయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, రైతు సంఘం నాయకుడు పెద్దన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'శాంతి సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం'

అనంతపురంటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శాంతి సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సంస్థ ధ్యేయమని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంస్థ చైర్మన్ శీలా జయరామప్ప విద్యార్థులతో కలిసి శాంతి ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా పెన్షనర్స్ భవన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... సమసమాజ స్థాపనతోపాటు పేదల సంక్షేమం కోసం మానవత స్వచ్ఛంద సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కోచైర్మన్ నరసింహారెడ్డి, కన్వీనర్ గంగిరెడ్డి, కార్యదర్శి ప్రకాష్‌బాబు, కోశాధికారి నాగరాజేశ్వరి, సంయుక్త కార్యదర్శి రామమూర్తి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జానపద కళలు గొప్ప వరం

● టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్

● ఉర్రూతలూగించిన జానపద జాతర

అనంతపురంటౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జానపద కళలు మన ప్రాచీన సంస్కృతి మనకు అందించిన గొప్ప వరమని టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం లలితకళా పరిషత్‌లో నిర్వహించిన జానపద జాతర వీక్షకులను ఉర్రూతలూగించింది. కార్యక్రమాన్ని జేఎల్ మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రాచీన కళలను ప్రోత్సహిస్తూ జానపద దినోత్సవంను జరుపుకోవడం ఆనందదాయకమని, భావితరాలకు సైతం ప్రాచీన కళలను వారసత్వంగా అందించాలని అన్నారు. అనంతరం సీనియర్ నాట్యాచార్యురాలు సంధ్యామూర్తిని డ్యాన్స్ మాస్టర్లు సత్కరించారు. తదనంతరం కళాకారులు జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, డ్యాన్స్ మాస్టర్లు కత్తి విజయ్‌కుమార్, హరిప్రసాద్, వన్నూర్, మాలిక్, రమేష్, నీల్ తదితరులు పాల్గొన్నారు.



జానపద నృత్యంతో అలరిస్తున్న కళాకారులు

'అర్హులకు అన్యాయం జరగకూడదు'

కనగానపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల పింఛన్ల విషయంలో అర్హులకు అన్యాయం జరగకూడదని , దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె ఎంపీడీఓ అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. బోగస్ పింఛన్లు తొలగించే క్రమంలో అర్హులకు అన్యాయం జరిగకూడదన్నారు. అలా ఎవరికైనా జరిగిగే గ్రామాల్లో ఉన్న టీడీపీ నాయకులు,అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

● శింగనమల: పింఛన్ల విషయంలో అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగదని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నింబంధన ప్రకారం వైకల్యం 40శాతం ఎక్కువ ఉన్న వారికి పింఛన్ యథావిధిగా వస్తుందన్నారు. ఏదైనా తప్పిదం జరిగి నోటీసులు వచ్చిన వారికి రీ వెరిఫికేషన్‌లో న్యాయం జరుగుతుందన్నారు. పెన్షన్‌పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారాలను ఎవరూ నమ్మరాదని అన్నారు.

● ఆత్మకూరు: పింఛన్ల విషయంలో దివ్యాంగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పింఛన్లు వస్తాయని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హత కలిగిన దివ్యాంగులకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. అనర్హుల పింఛన్ల ఏరివేత మాత్రమే జరుగుతోందని అన్నారు. రీవెరిఫికేషన్ జాబితాలో పేరున్న దివ్యాంగులు మండల పరిషత్ కార్యాలయంలో సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్‌తో పాటు సంబంధిత అధికారులు అందజేసిన నోటీసు పత్రాలను ఎంపీడీఓకు అందజేయాలని సూచించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రామగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పేరూరులో గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధాకర్‌యాదవ్ శుక్రవారం తెలిపారు. నాగేంద్ర తన తమ్ముడు వెంకటేశ్ కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి అశ్వర్థనారాయణ కుమారుడు విజయ్‌కుమార్‌పై దాడికి పాల్పడి ఇంటిలోని వస్తుసామగ్రిని ధ్వంసం చేసి తీవ్రంగా నష్టపరిచారు. దీనిపై విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఆ ఘర్షణలో విజయ్‌కుమార్ తనపై దాడి చేశారని నాగేంద్ర కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.వీరిని కోర్టుకు హాజరపరచనున్నట్టు చెప్పారు.

దోమల నివారణకు మందు పిచికారీ

రాప్తాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రామినేపల్లి, హంపాపురం గ్రామాల్లో శుక్రవారం దోమల నివారణకు మలాథియాన్ మందును పిచికారీ చేశారు. ఇంటింటా పిచికారీ చేయించినట్లు జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి అబ్దుల్ మునాఫ్, సూపర్వైజర్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

అనంతపురంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి గ్రామ సమీపంలో గల ఎరా ఇంటర్నేషనల్ స్కూల్లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ హాజరై ట్రాఫిక్ నియమాలు వివరించారు. నిబంధనలు పాటిస్తూ రహదారిపై సురక్షితంగా వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రత వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల డైరెక్టర్ వినూత్నరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా సరఫరా చేయాలి



డీసీఎంఎస్‌లో గోడౌన్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ నెట్టెం, జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు జేడీఏ ఉమామహేశ్వరమ్మను కోరారు. నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి గోడౌన్‌ను పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. యూరియా డిమాండ్ అధికంగా ఉన్నందున సరఫరా పెంచాల్సిన అవసరం ఉందని, రైతులందరికీ వీటిని అందించాలని తెలిపారు. దీనికి జేడీఏ స్పందిస్తూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైతుల అవసరాలకు అనుగుణంగానే యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ అల్తాఫ్ అలీఖాన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, ఏఓ వెంకట్‌కుమార్, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత సృష్టించి బ్లాక్‌లో రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఉమాదేవి హెచ్చరించారు. మండలంలోని రెడ్డిపల్లి, దయ్యాలకుంటపల్లి, గ్రామాలలో ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఇందులో నిల్వ ఉంచిన యూరియా వివరాలు తెలుసుకుని రికార్డుల్లేని యూరియాను బ్లాక్ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. యూరియాను ఎక్కువ ధరకు అమ్మితే రైతులు నేరుగా మండల ఏఓకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు రామాంజినమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబానికి ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ఒకరోజు వేతనం రూ.1.27 లక్షల మొత్తాన్ని శుక్రవారం ఎస్ఈ రాజ శేఖర్ చేతుల మీదుగా కార్యాలయంలో అందజేసి ఆర్థిక చేయూతనిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళీమోహన్, కోశాధికారి పోతలయ్య, ఏపీఈడబ్ల్యూఏ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, శివన్న, లోకనాథ్‌చౌదరి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ అధికారిగా డీఎల్‌పీఓ విజయ్‌కుమార్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నార్పల గ్రామపంచాయతీలో అక్రమాలు జరిగినట్లు విమర్శలు రావడంతో వాటిపై నిగ్గు తేల్చడానికి డీపీఓ నాగరాజనాయుడు డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. దీంతో శనివారం డీఎల్‌పీఓ విచారణకు వెళ్లనున్నట్లు తెలిసింది. అక్కడ పూర్తి స్థాయిలో విచారణ చేసి అందుకు అనుగుణంగా నివేదిక తయారు చేసి సమర్పించనున్నారు.

గణేష్ వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి: సీఐ



శేఖర్, అనంతపురం రూరల్ సీఐ

అనంతపురం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగ నేపథ్యంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుల నిబంధలను తప్పనిసరిగా పాటించాలని అనంతపురం రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఎస్పీ జగదీష్, డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుల నిబంధనలు, ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినాయక మండపాలు, విగ్రహాలు పెట్టే ముందు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. అదేవిధంగా డీజేలు పెట్టకూడదన్నారు. విగ్రహాలను మూడు రోజుల్లో నిమజ్జనం చేయాలన్నారు. విగ్రహాలు పెట్టడం నుంచి నిమజ్జనం వరకూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రజలకు, పోలీసులకు సహకరించాలని సీఐ పేర్కొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడికి 'ఆదరణ' చేయూత

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ప్రైవేట్ ఉపాధ్యాయుడికి ఆర్థిక చేయూతనిచ్చింది ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జగదీష్ నాలుగురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబం కావడంతో ఆయన స్నేహితులు, ఆదరణ సేవాసమాజ్ ట్రస్టు వివిధ సంస్థలతో కలిసి రూ.52,300 నగదును సమీకరించారు. అనంతరం మొత్తాన్ని శుక్రవారం బాధితుడి భార్య అంజలికి ఆస్పత్రిలో అందజేశారు. ఆదరణ ట్రస్టు అధ్యక్షుడు తాడిమర్రి లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి: కలెక్టర్

అనంతపురం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్యకార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అన్ని జిల్లాలకంటే మెరుగ్గా నైపుణ్య కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ప్రథమ బహుమతి పొందిన సంబంధిత అధికారి ప్రతాప్‌రెడ్డిని ఆయన అభినందించారు. నైపుణ్య కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి మరింత మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు



కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయం, నసనకోట ముత్యాలమ్మ ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

రామగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను మండలంలోని ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నసనకోటలో అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌పుస్తకాలు, మిఠాయిలు పంపిణీచేశారు. కుంటిమద్ది, రామగిరి, పేరూరు గ్రామాల్లో కేక్‌కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అభిమానులు కేబీ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు సంపత్‌కుమార్, ఉమాకాంత్, చెన్న, షణ్ముక, మురళీ, విజయ్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి కొళాయిలను క్రమబద్ధీకరించుకోవాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారికంగా కొళాయి కనెక్షన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ 30రోజుల్లోపు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేని పక్షంలో కొళాయి కనెక్షన్లను వెంటనే తొలగిస్తామన్నారు. తిరిగి కనెక్షన్ పొందేందుకు రెట్టింపు చార్జీలు వసూలు చేస్తామని హెచ్చరించారు.

నేడు మట్టి విగ్రహాల తయారీపై పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఒకటో రోడ్డులోని శారదా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ పెద్దిరెడ్డి వెంకట కిషోర్‌కుమార్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 6వతరగతి నుంచి 10వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. విగ్రహాల తయారీకి అవసరమైన బంకమట్టి,నీటిని సమకూరుస్తామని తెలిపారు. పర్యావరణ హితమట్టి వినాయక విగ్రహాల వాడకాన్ని పెంచే ఉద్దేశ్యంతోనే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

గ్రీన్ కవరేజీపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో శుక్రవారం గ్రీన్ కవరేజీపై సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రాహార్ మాట్లాడుతూ.. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నగరంలో వార్డు సచివాలయాల వారిగా అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి మొక్కల నాటుటకు అవకాశం గల ప్రాంతాలను వార్డు అమెనిటీ సెక్రటరీల ద్వారా సర్వే చేయించాలని అధికారులకు ఆదేశించారు. జీపీఎస్ సాంకేతిక ద్వారా సర్వే చేసి జాబితాను సంబంధిత ఇంజనీర్లకు అందజేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ నివేదిక కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. కలెక్టర్ ఆమోదంతో మూడు నాలుగు రోజుల్లో నగరాన్ని పచ్చదనంతో నింపేందుకు అవెన్యూ ప్లాంటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, నరసింహులు, డీఈలు, ఏఈలు, వార్డు సచివాలయాల అమెనిటీస్ సెక్రటరీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గం అభివృద్ధికి సలహాలివ్వండి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీని 2047ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు తయారు చేస్తున్నామని, అందుకు పట్టణ ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. మున్సిపాల్టీ మాస్టర్‌ప్లాన్‌పై కమిషనర్ వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ ఒక్కసారి అమలైతే 20 ఏళ్ల వరకు మార్చడానికి అవకాశం ఉండదన్నారు. పట్టణంలో క్రీడా మైదానం నిర్మిస్తామని, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామ ని, దెబ్బతిన్న రహదారులను బాగుచేస్తామని, డ్రైనేజీ పనులు ముగింపు దశకు వ చ్చాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీరామ్‌రెడ్డి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండేళ్ల జీతాలు రూ. 25 కోట్లు అందించిందన్నారు. అయినా వైసీపీ కాంట్రాక్టర్ కార్మికులను రెచ్చగొట్టి రెండు నెల ల ధర్నాలు చేయించి ప్రజలకు నీళ్ల సరఫరా చేయించకుండా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో వాల్మీకి ఫె డరేషన్ డైరక్టర్ వైపీ రమేష్, మార్కెట్ యా ర్డు వైస్‌చైర్మన్ కోనంకి రాజశేఖర్ పాల్గొన్నారు.

నిండిన శ్రీధరఘట్ట చెరువు



బొమ్మనహాళ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలు రావడం.. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో .. మండలంలోని శ్రీధరఘట్ట చెరువు నిండి శుక్రవారం మరువ పారింది. దీంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఈ ఏడాది రెండు పంటలకు సరిపడా నీరు చేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద 450 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. వరి నాట్లు జోరందుకున్నాయి.

మరువ పారుతున్న చెరువు



కసాపురం, రాయదుర్గంలో వరమహాలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి వ్రతం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలోని యాగశాలలో మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం విజయరాజు, అనువంశీక ధర్మకర్త కే సుగుణమ్మ, ఆలయ అధికారులు, గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : స్థానిక శ్రీహఠకేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీవరమహాలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. స్వకులసాలి సమాజ సత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదాదేవి ట్రస్ట్ నిర్వాహకులు స్వామి అర్చనానంద, వారి శిష్య బృందం అమ్మవారి కీర్తనలు, భజనలు చేశారు.



గుంతకల్లులో వాసవీమాత, తాడిపత్రిలో గాయత్రీమాతకు అలంకరణ

శ్రావణ శుక్రవార పూజలు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● తాడిపత్రి: పట్టణంలోని సంజీవనగర్ మొదటి రోడ్డులో ఉన్న శ్రీ వేదమాత గాయత్రీదేవి వెండి కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న పంచాయతీ సిబ్బంది

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ఉరవకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా జియారత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో అమ్మవారికి చాదర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అర్ధరాత్రి షంషేర్‌ను పట్టణంలోని వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు



కుందుర్పి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కుందిర్పమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

శెట్టూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు ఉధృతంగా సోకి.. అపార నష్టం కలిగిస్తోందని వ్యవసాయాధికారి వాసుకిరాణి అన్నా రు. శుక్రవారం పలు గ్రామాల్లో పంటలను పరిశీలించిన ఆమె మాట్లాడారు. కత్తెరపురుగు నివారణకు లీటర్ నీటికి ఎమామేక్టిన్, బెంజోయేట్ మందును 0.4 గ్రాములు కలిపి.. లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సిని 0.3 మిల్లీలీటర్లతో నీటికి కలిపి ఆకుసుడులు బాగా తడిసేలా పిచికారి చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉరవకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆది, సోమవారాల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రమాదేవి, అంజుమ్, నందిని, వినయ్ ఎంపికయ్యారు. ఈ నెల 18, 19 తేదీల్లో తిరుపతిలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు.. ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం

శెట్టూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఆమెను బసంపల్లి పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇందులో ఉపాధ్యాయుడు శంకర్, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సన్మాన సభలో ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి

పీఏబీఆర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

కూడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పెన్నాహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్‌డ్యాం)కు వస్తున్న నీరు తగ్గింది. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 332 క్యూసెక్కులతో పాటు లింక్ ఛానల్ ద్వారా 98 క్యూసెక్కుల నీరు మాత్రమే పీఏబీఆర్‌లోకి వస్తోంది. దీంతో డ్యాంలో నీటి మట్టం 433.750 మీటర్లకు చేరుకొని.. 4.285 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు శుక్రవారం తెలిపారు.

● బెళుగుప్ప : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,985 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 1,945 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటినిల్వ 1.729 టీఎంసీలు ఉందని, ఫేజ్-2కు 1,526 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

నేడు కలెక్టర్ రాక

పుట్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామసచివాలయంలో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరవుతున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

'25న చలో కలెక్టరేట్'

గుత్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక అర్అండ్‌బీ అతిథి గృహంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. జీఓ నెంబర్ 72ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, నవీన్, నాయకులు చరణ్, థామస్, జయరాజు, మధు, జిలాన్ పాల్గొన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలని..

● రాయదుర్గంరూరల్: దివ్యాంగులకు తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ డిమాండ్‌తో సోమవారం అనంతపురం కలెక్టరేట్ దగ్గర నిర్వహించే ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొనాలని కోరారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మండలంలో రోడ్లకు చేపట్టిన ప్యాచ్ వర్కుల్లో నాణ్యత లేదని, వాటిని చేపట్టిన అర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమరావతిలో సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేసినట్లు శుక్రవారం తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేయించి.. చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

బ్యాంక్‌లో సమస్యలు పరిష్కరించండి

కుందుర్పి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంకులోని సమస్యలు పరిష్కరించాలని ఏజీఎం ప్రదీప్‌కుమార్, అనంతపురం ఆర్ఎం శ్రీనివాస్‌ను స్థానిక ఖాతాదారులు విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ తనిఖీకి వచ్చిన వారికి వినతి పత్రం అందజేశారు. బ్యాంక్‌లో ఒకే కౌంటర్ ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఏటీఎం పని చేయడం లేదని ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

మండల అధ్యక్షుల నియామకం

తాడిపత్రి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండలాలకు అధ్యక్షులను నియమించామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. తాడిపత్రి టౌన్ అధ్యక్షుడిగా గౌస్, రూరల్‌కు ఈశ్వరరెడ్డి, పెద్దపప్పూరుకు అరుణమ్మ, పెద్దవడుగూరుకు రామకృష్ణారెడ్డి, యాడికికి మధును నియమించినట్లు తెలిపారు.

మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యుల ర్యాలీ

తాడిపత్రి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావం సందర్భంగా ఆ సంఘం సభ్యులు పట్టణంలోని గాంధీసర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు సంస్థ తరఫున చేస్తున్న సేవలను అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి వివరించారు. బాడీ ఫ్రీజర్ సేవలను ఉచిత ంగా అందిస్తున్నామని, వివరాలకు 98854 39902ను సంప్రదించాలని కోరారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పెద్దవడుగూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఆధారంగానే పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి తెలిపారు. అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎకరా పత్తిపంట పొలంలో 16 నుంచి 20 వరకు లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఓ మునికృష్ణ, ఏఈఓ సునీత ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమలను నివారణకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణంలోని నర్సోజీ కుంట, వట్లకుంట, సీతమ్మకుంటలో గంబోసియా చేపలను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ శుక్రవారం వదిలారు.

ఘనంగా చిరంజీవి జన్మదినం



ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న అభిమానులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక మస్తానయ్య దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు అల్పాహారం ప్యాకెట్లను అందజేశారు. వాసవీ టాకీస్‌లో కేక్ కట్ చేశారు. అలాగే జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కురుబ పురుషోత్తం ఆధ్వర్యంలో అమృత వర్షిణి బాల కల్యాణ ఆశ్రమంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు పాండుకుమార్, పూల ఎర్రస్వామి, పవర్‌శేఖర్, కొండపల్లి అంజి, అనిల్, కృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



శీనప్ప (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్. శీనప్ప (72) అనారోగ్యంతో తన స్వగృహంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహానికి సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, మండల మాజీ ఉపాధ్యాక్షుడు పయ్యావుల మోహన్‌బాబు, టీడీపీ నాయకులు కొత్తపల్లి మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, సప్తగిరి సత్యనారాయణ నివాళులర్పించారు. కాగా, శీనప్ప ఉంతకల్లు గ్రామ సర్పంగా పనిచేశారు. ఆయన భార్య పుష్పాలత బొమ్మనహాళ్ ఎంపీపీగా పనిచేశారు. ఆయన సోదరుడు ఆర్. చంద్రహాస్ రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

మాజీ ఎంపీటీసీ...



గిరిప్రసాద్ (ఫైల్)

గుత్తి రూరల్:మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ గిరిప్రసాద్ (55) అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. ఆయన మృతదేహానికి ఎ మ్మెల్యే కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్ , టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు బర్దీవలి, ఏంకే చౌదరి, నాయకులు నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కూడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలం కొర్రకోడులో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటలను దాదాపు 80 మంది శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం పరిశీలించారు. కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తక్కువ పెట్టుబడులతో సాగు చేస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



వృథా అవుతున్న తాగునీరు

పగిలిన తాగునీటి పైప్

విడపనకల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోటకు వెళ్లే తాగునీటి పైప్‌లైన్ కొండ వద్ద పగిలింది. దీంతో ఆ గ్రామానికి తాగునీరు వెళ్లటం లేదు. నీరు వృథా అవుతోంది. కొత్తకోటకు వెళ్లే రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. అధికారులు ఈ పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామంలో హరిజన శ్రీరాములు కుమారుడు సుందర్ (35) అతని ఇంట్లో శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సుందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రామలక్ష్మి అనే వివాహిత కుటుంబ కలహాల కారణంగా గురువారం రాత్రి విషద్రావకం తాగి .. ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రిమాండ్‌కు నిందితుడు

డీ.హీరేహాళ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో గత నెల స్థానికుడు వడకప్పపై స్థానికుడు తిప్పేస్వామి దాడి చేసి.. పారిపోయాడు. వడకప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు తిప్పేస్వామిపై కేసు నమోదు చేసి.. గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు కళ్యాణదుర్గం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వక్కచెట్ల నరికివేత

కుందుర్పి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ వెంకటంపల్లి గ్రామానికి చెందిన రైతు హనుమంతరెడ్డి పొలంలోని వక్కచెట్లను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. తన రెండు ఎకరాల్లో సుమారు 600 వక్క చెట్లు ఉండగా.. వాటిలో దాదాపు 300 చెట్లను నరికేసినట్లు బాధిత రైతు శుక్రవారం వాపోయాడు. దీనికి స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు, దివ్యాంగులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పింఛన్లను పునరుద్ధరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ ఆందోళనకారులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వద్దకు పిలుపుకొనివెళ్లాడు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్రబాబు, ఉలిగప్ప, షాషు, జాకీర్, జ్యోతి పాల్గొన్నారు.

పర్వతారోహణ సంస్థ శిబిరానికి ఎంపిక

రాయదుర్గంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ పర్వతారోహణ సంస్థ, అడ్వెంచర్స్ స్పోర్ట్స్ శిబిరానికి స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ గణితశాస్త్రం ద్వితీయ సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ గౌతమ్ ఎంపికయ్యాడు. దీంతో గౌతమ్ అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం దిరాంగ్ గ్రామంలోని ఆ సంస్థ నిర్వహించే శిబిరంలో శిక్షణ పొందుతాడని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు.

భాగవత పారాయణం

తాడిపత్రి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలదిన్నె గ్రామంలోని సీతారామస్వామి ఆలయంలో శుక్రవారం భాగవత పారాయణం జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి భాగవతంలోని అంశాలను వివరించారు.

155 మంది పింఛన్ల నిలిపివేత

రాయదుర్గం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్లు అందుకొనే దివ్యాంగులు 700 మంది ఉన్నారని, అందులో 155 మందికి పింఛన్లు నిలిపివేస్తున్నట్లు నోటీసులు అందించామని ఎంపీడీఓ కొండన్న శుక్రవారం తెలిపారు. నిలిపివేసిన వారిలో అర్హులుంటే కొత్తగా సదరం సర్టిఫికెట్లను అందించాలన్నారు.